ప్రజాశక్తి
గురువారం 5 జూన్ 2025 5
అనంతపురం



నేటి నుంచి సబ్సిడీ వేరుశనగ పంపిణీ

పంపనూరులో ప్రారంభించనున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అనంతపురం

ఖరీఫ్ సాగుకు సంబంధించి రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ వేరుశనగ పంపిణీ మొదలు కానుంది. గురువారం నాడు జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేలా వ్యవసాయ అధికారులు సిద్ధం అయ్యారు. పంపిణీలో భాగంగా గురువారం నాడు ఆత్మకూరు మండలం పంపనూరు గ్రామంలో ఉదయం 9.00 గంటలకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై సబ్సిడీ వేరుశనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తారని జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ తెలియజేశారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులందరికీ విత్తనాలు అందించే ఏర్పాటు చేశామని ఆమె తెలియజేశారు.

కరోనా కలవరం..!

- అనంతలో మొదటి కేసు నమోదు
- కోవిడ్ కేసు రావడంతో కలవరం
- ఆందోళన కలిగిస్తున్న పాత భయం





ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో కరోనా కలకలం రేపింది. దేశంలో కరోనా బాధితులు పెరుగుతున్న తరుణంలో జిల్లాలో మెదటి కేసు నమోదయింది. అనంతపురం నగరంలోని పాతూరుకు చెందిన ఓ గర్భిణి బుధవారం జ్వరం, జలుబు, దగ్గు లక్షణాలతో ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు చికిత్స నిమిత్తం వెళ్లారు. వైద్యులు అనుమానంతో కోవిడ్ రాపిడ్ టెస్ట్ నిర్వహించగా కోవిడ్ లక్షణాలు ఉన్నాయని తేలింది. దీంతో సదరు మహిళను ఆసుపత్రిలో వైద్యం తీసుకోవాలని సూచించగా ఆమె నిరాకరించి హోం ఐసోలేషన్‌లో ఉంటానని వైద్యులతో వెల్లడించి వెళ్లినట్లు తెలిసింది. కోవిడ్ కేసు నమోదు కావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు హెచ్చరించాయి .

సన్నద్ధత ఎంత..!

కరోనా కేసులు పెరిగితే వైద్యం అందించడానికి సన్నద్ధత ఏ మేరకు ఉందన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. గతంలో కోవిడ్ వచ్చిందంటే వైద్యం అందివ్వడానికి ప్రత్యేకమైన వసతులు ఏర్పాటై ఉండేవి. ఐసోలేషన్ వార్డుల్లో పెట్టి వైద్యం అందించేవారు. ఈ జబ్బు విస్తరించకుండా అవసరమైన నియంత్రణ చర్యలను చేపట్టారు. ఇప్పుడు ఆ సన్నద్ధత ఏది కనిపించడం లేదు. తొలి కేసు నమోదు అయిన నేపథ్యంలో నైనా అధికార యంత్రాంగం ఇటువంటి చర్యలను తీసుకుంటుందా అన్న చూడాల్సి ఉంది.

కలవరపెడుతున్న పాత జ్ఞాపకాలు

మూడు సంవత్సరాల క్రితం ఉమ్మడి జిల్లాలో కోవిడ్ కేసులు గణనీయంగా నమోదయ్యాయి. ఆ సమయంలో వందల సంఖ్యలో మరణాలు సంభవించాయి. ఆ బాధల నుంచి ఇంకా ఆ కుటుంబాలు తేరుకోలేదు. అదే సందర్భంలో ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్ ఆంక్షలు నేపథ్యంలో చాలా కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయి. ఇప్పటికి ఆర్థిక సమస్య నుంచి కుటుంబాలు తేరుకోలేక ఇబ్బందులు పడుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో మరోమారు కోవిడ్ ప్రమాదం ఆందోళనకు గురిచేస్తుంది. ఇది ఏ మేరకు తమ జీవితాలపై ప్రభావం చూపుతోందో నన్న గుబులు ప్రజలను వెంటాడుతోంది. నియంత్రణకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో చూడాల్సి ఉంది.



పోలీసులు అడ్డుకోవడంతో యల్లనూరు మండలం తిమ్మంపల్లి గ్రామంలో తన నివాసం వద్ద ఉన్న మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి



పెద్దారెడ్డి గ్రామం నుంచి బయటకు వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా ఉంచిన పోలీసు వాహనం

కేతిరెడ్డి పెద్దారెడ్డి గృహనిర్బంధం

యాడికికి వెళ్లకుండా అడ్డగింత-పోలీసుల తీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి-యల్లనూరు

అనంతపురం జిల్లా తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని పోలీసులు గృహ నిర్బంధం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం కార్యక్రమంలో పాల్గొనేందుకు యాడికి మండల కేంద్రానికి వెళ్తున్న ఆయన్ను పోలీసులు బుధవారం ఉదయం అడ్డుకున్నారు. శాంతిభద్రతల నేపథ్యంలో యాడికికి వెళ్లేందంటూ పోలీసులు ఆయనకు తెలియజేశారు. యల్లనూరు మండలం తిమ్మంపల్లి గ్రామంలోని ఆయన నివాసంలోనే నిర్బంధించారు. తాను తాడిపత్రి నియోజకవర్గంలో పర్యటించేందుకు కోర్టు అనుమతి ఉన్నా ఎందుకు పదేపదే అడ్డుకుంటున్నారని కేతిరెడ్డి పెద్దారెడ్డి పోలీసులతో వాగ్వాదం చేశారు. పోలీసులు మాత్రం శాంతిభద్రతల పేరుతో పెద్దారెడ్డిని గృహనిర్బంధంలోనే ఉంచారు.

తాడిపత్రి ఎవరి జాగీరు కాదు :పెద్దారెడ్డి

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అపహాస్యానికి గువుతోందని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గృహ నిర్బంధం చేసిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడు ఎక్కడైనా స్వేచ్ఛగా తిరిగే అవకాశం ఉందన్నారు. అలాంటిది తాడిపత్రి నియోజకవర్గంలో తనను ఎక్కడికీ వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. తాడిపత్రి ఎవరి జాగీరుకాదన్న విషయాన్ని కొందరు గుర్తుంచుకోవాలన్నారు. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకే జిల్లా ఎస్పీ నడుచుకోవడం సరికాదన్నారు. తన అనుచరులపై అక్రమ కేసులు బనాయించి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అనుసరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను తాడిపత్రికి వెళ్లేందుకు హైకోర్టు అనుమతి ఇచ్చినా పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. ఈ విషయంపై తాను జిల్లా ఎస్పీని కలుస్తానని పెద్దారెడ్డి తెలియజేశారు.



స్వర్ణయుగానికి ఏడాది కార్యక్రమంలో కేక్ కట్ చేస్తున్న టిడిపి శ్రేణులు

'స్వర్ణయుగానికి ఏడాది'..!

టిడిపి ఆధ్వర్యంలో సంబరాలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వైసీపీ నాయకులు చేపట్టిన వెన్నుపోటు దినంకు దీటుగా టీడీపీ ఆధ్వర్యంలో 'స్వర్ణయుగానికి ఏడాది' పేరుతో విజయోత్సవ సంబరాలను చేసుకున్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గం పరిధిలో ఆ పార్టీ శ్రేణులు భారీ ఎత్తున ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ వైసీపీ దుష్టపాలనకు ప్రజలు చరమగీతం పాడి ఏడాది పూర్తయ్యిందన్నారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అనేక హామీలను నెరవేర్చిందన్నారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటే చూసి ఓర్వలేక జగన్ రెడ్డి వెన్నుపోటు దినం అంటూ నాటకాలకు తెరలేపారన్నారు. ఇలాంటి వాటిని ప్రజలు నమ్మబోరని టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. మోసానికి, వెన్నుపోటుకు కేరాఫ్ అడ్రస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు.అందుకే ఆయన్ను ప్రజలు చీత్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి గడ్డం సుబ్రమణ్యం, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, టిడిపి యువ నాయకుడు బోయపాటి అశోక్, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి సరిపూటి రమణ, కార్పొరేటర్లు బాలాంజనేయులు, జనబలం బాబా తదితరులు పాల్గొన్నారు.



నష్టాల పూ[పా]లు

- పడిపోయిన పూల ధరలు
- పెట్టుబడులు కూడా చేతికందని వైనం

ప్రజాశక్తి-గుత్తి

ధరలు పడిపోవడంతో పూలసాగు రైతులు నష్టాలు వెంటాడుతున్నాయి. పెట్టుబడులు కూడా చేతికందక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. అనంతపురం జిల్లా గుత్తి మండలం అబ్బేదొడ్డి గ్రామంలో దాదాపు 300 ఎకరాల్లో పూల సాగు అవుతుంది. 300 కుటుంబాలు పూల సాగుపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. పెద్ద ఎత్తున పూల సాగు చేస్తూ ఈ గ్రామ రైతులు జిల్లాలోనే ఆదర్శంగా నిలిచారు. గత ఏడాది జాజి మల్లె, కనకాంబరం సాగు చేసి మంచి లాభాలను పొందారు. ఈ ఏడాది ధరలు లేక కనీసం కూలీల ఖర్చులు కూడా రాని పరిస్థితి నెలకొంది. కూలీల కొరత, వర్షాభావం, మార్కెటింగ్ సదుపాయం, అధ్వాన్నంగా రోడ్లు తదితర సమస్యలు పూల రైతులను వెంటాడుతున్నాయి. ఫలితంగా సాగు విస్తీర్ణం సగానికి సగం తగ్గిపోయింది.

అబ్బేదొడ్డి గ్రామంలో ఒక్కో రైతు 30 సెంట్ల నుంచి ఎకరం వరకు మల్లెపూల సాగు చేస్తున్నారు. రానురాను వర్షాభావ పరిస్థితులతో గిట్టుబాటు ధర లేక రవాణా ఖర్చులు అధికం కావడంతో మల్లెపూల సాగు తగ్గుముఖం పడుతోంది. పూలు కోయడానికి కూలీల సమస్య తీవ్రంగా ఉంది. రైతులు కూలీలను తీసుకురావడానికి ఆటోలు కొనుగోలు చేసి, అందులో వారిని ఉదయం తీసుకుని వచ్చి, సాయంత్రం వారి ఇళ్ల వద్ద వదిలి వెళు న్నారు. ప్రస్తుతం కిలో జాజి మల్లె గరిష్టంగా రూ.120 పలుకుతోంది. ఒక కూలీ రోజుకు రెండు కిలోల పూలు కోస్తే వారికి కూలి రూ.200 నుంచి రూ.250 వరకు ఇవ్వాల్సి వస్తోంది. ఏరోజుకారోజు పూలు తెంపకుండా అలాగే ఉంచితే అవి విచ్చుకుని రాలిపోతాయి. ప్రస్తుతం పండుగలు లేకపోవడంతో పూల ధరలు భారీగా తగ్గాయి. దీంతో పెట్టుబడులు కూడా చేతికందడం లేదు.

గుత్తి మండలంలోని అబ్బేదొడ్డి, అనగానిదొడ్డి, నేమితాబాద్, పెద్దొడ్డి గ్రామాల పరిధిలో కనకాంబరాల సాగుకు అనుకూలంగా ఉంటాయి. ఇక్కడి ప్రాంతాల్లో అధిక తేమ, వాతావరణ పరిస్థితులు ఈ పంట సాగుకు అనుకూలిస్తాయి. మట్టిలో నీటి నిల్వలు, నేల రకాలు సాగుకు అనుకూలంగా ఉంటాయి. జాజి మల్లె, కనకాంబరాలు ప్రధాన పంటగా మాత్రమే కాకుండా కొబ్బరి, పామాయిల్, జామ, దానిమ్మ, నారింజ వంటి తోటల్లో అంతర పంటగా కనకాంబరం సాగు చేస్తుంటారు. అబ్బేదొడ్డిలో ఎక్కువగా పండించే పంటల్లో మల్లె కూడా ఒకటి. గుండుమల్లెను ఎక్కువ విస్తీర్ణంలోనూ, జాజిమల్లె తక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. గుండుమల్లె, జాజిమల్లి సువాసనలను వెదజల్లుతాయి. గుండుమల్లె మార్చి నుంచి సెప్టెంబర్ వరకు, జాజిమల్లె మార్చి నుంచి నవంబర్ వరకు పూల దిగుబడినిస్తాయి. ఏడాది కాలంగా పూలకు ధరలు ఆశాజనకంగా లేవు. కాత ఎక్కువగా ఉన్నా, ధర లేక రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం పూలను మద్దతు ధరతో కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. పంట రవాణాకు సరైన రవాణా సౌకర్యం కల్పించాలంటున్నారు. స్థానికంగా కోల్డ్ స్టోరేజ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.





అబ్బేదొడ్డి గ్రామంలో సాగులో ఉన్న మల్లె, కనకాంబరం పూలు



వెన్నుపోటు దినంలో భాగంలో ఉరవకొండలో నిరసన ప్రదర్శన చేస్తున్న వైసిపి శ్రేణులు

వైసిపి నిరసన స్వరం

జిల్లా వ్యాప్తంగా 'వెన్నుపోటు దినం' ర్యాలీలు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వైసిపి నాయకులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి పక్ష వైసిపి ఆధ్వర్యంలో 'వెనుపోటు దినం' నిరసన కార్యక్రమాలను బుధవారం కొనసాగాయి. ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు ఎండగట్టారు. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన ర్యాలీలను చేపట్టారు. అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా నియోజకవర్గ ఎమ్మెల్సీలు, సమన్వయకర్తలు, ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు పాల్గొన్నారు. చంద్రబాబు వెన్నుపోటు రాజకీయాలను గుర్తు చేస్తూ వైసీపీ నాయకులు ప్రసంగించారు. బాబు షూరిటీ ఇస్తే మోసం గ్యారంటీ అంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. సూపర్-6 అమలు జరగలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

వార్త 6లో


పొగాకు రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బుక్కరాయసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ తెహరున్నీసా, జిల్లా పొగాకు నియంత్రణ సోషల్ వర్కర్ బి.శ్రీరాములు ఆధ్వర్యంలో వేర్వేరుగా పొగాకు నియంత్రణ అవగాహన కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బస్టాండ్ ప్రాంతాల్లో ర్యాలీలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ పొగాకు రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే నష్టాలను తెలుసుకుని వాటికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిఐ పుల్లయ్య, ఎఎస్ఐ ఆదినారాయణ, మల్లికార్జున, మెడికల్ ఆఫీసర్ సిహెచ్ఒ మోహన్ రావు, పిపిహెచ్ఎన్ చెన్నమ్మ, సూపర్‌వైజర్ సత్యనారాయణ, ఎఎన్ఎం అదినారాయణమ్మ పాల్గొన్నారు.

నేడు ఢిల్లీకి అనంత మేయర్

పర్యావరణ సదస్సులో పాల్గొననున్న వసీం



మేయర్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2025ను న్యూఢిల్లీలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు అనంతపురం నగర మేయర్ మొహమ్మద్ వాసీం సలీంకు ఆహ్వానం అందింది. సదస్సులో పాల్గొనేందుకు ఆయన బుధవారం ఢిల్లీ వెళ్లారు. ఈ సంవత్సరం "ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం" అనే థీమ్ మీద సదస్సు జరుగుతోంది. నగరాలు, పట్టణాల్లో నిర్వహణ లేని చెత్తాచెదారం వల్ల ఎదురయ్యే పర్యావరణ, ప్రజారోగ్య సవాళ్లను పరిష్కరించాల్సిన తక్షణ చర్యలపై సదస్సులో పాల్గొని వివరించనున్నారు.

6 నుంచి ఉపాధ్యాయుల ఎంపిక పరీక్షలు

అన్ని ఏర్పాట్లు పూర్తి : డిఇఒ

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ-2025కు సంబంధించి నిర్వహిస్తున్న ఏపీ టీచర్స్ రిక్రూట్మెంట్ టెస్ట్‌ను ఈనెల 6న నిర్వహిస్తున్నట్లు డీఈవో ప్రసాద్ బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ టెస్ట్ ఈనెల 6వ తేదీ నుంచి 30 తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రతిరోజు రెండు విడతలుగా జరుగుతాయన్నారు. పరీక్షల నిర్వహణకు అనంతపురంలో 5, తాడిపత్రిలో 1, గుత్తిలో 1, పుట్టపర్తిలో 1, బెంగళూరులో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పేపర్ల వారిగా 45,186 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు, వైద్య సేవలకోసం ఎఎన్ఎంలను కేటాయించామన్నారు, అభ్యర్థులు వారి హాల్ టికెట్, గుర్తింపు కార్డుతో పరీక్ష సమయానికి కంటే 1.-30 గంట ముందుగానే చేరుకోవాలని తెలియజేశారు. పరీక్షా కేంద్రాల వివరాల కోసం https://deoananthapuramu.blogspot.com, cse.ap.gov.in వెబ్ సైట్ ద్వారా తెలుసుకోవచ్చున్నారు. హాల్ టికెట్లో పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు ఇతర తప్పులు ఉంటే అభ్యర్థులు వారి ఒరిజినల్ ఎస్ఎస్‌సి సర్టిఫికెట్, ఇతర సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లు పరీక్ష కేంద్రంకు తీసుకెళ్లి డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌కు అందజేయాల్సి ఉంటుందన్నారు.

శిక్షణ కార్యక్రమాలు వాయిదా వేయండి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పాఠశాల సంసిద్ధత శిక్షణ కార్యక్రమాలను వాయిదా వేయాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, ఎస్.సిరాజుద్దీన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డిఇఒ ఎం.ప్రసాద్ బాబును బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతుల వెబ్ ఆప్షన్లు ఇచ్చే పనుల్లో ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు దీనిని వాయిదా వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సర్దార్ వలి, జిల్లా ఉపాధ్యక్షులు సతీష్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ వెంకటరమణ పాల్గొన్నారు.

'సేవ్ ఆర్‌డిటి' పాదయాత్ర ప్రారంభం



పాదయాత్ర చేస్తున్న తలారి రంగయ్య

ప్రజాశక్తి-బెలుగుప్ప

రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్(ఆర్‌డిటి) విదేశీ నిధులకు సంబంధించి ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్(ఎఫ్‌సిఆర్ఎ)ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎంపీ తలారి రంగయ్య 'సేవ్ ఆర్‌డిటి' పేరుతో బుధవారం పాదయాత్రను ప్రారంభించారు. ముందుగా గొంచితండా గ్రామంలో సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం పాదయాత్ర చేయట్లేదన్నారు. ఆర్‌డిటి 50 ఏళ్లకుపైగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో అన్ని వర్గాల ప్రజలకు విశేష సేవలందిస్తుందన్నారు. అలాంటి సంస్థకు విదేశీ నిధులు రాకుండా ఆటంకం కలిగించడంతో జిల్లా ప్రజలకు అనేక సేవలు ఆగిపోయాయన్నారు. కావున కేంద్రం వెంటనే ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించాలని కోరారు. పాదయాత్రలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరెడ్డి, మెట్టు గోవిందరెడ్డి, నాయకులు మహాలక్ష్మి శ్రీనివాస్, ఉమామహేశ్వర్ నాయుడు, తిప్పేస్వామి, శివాజీ పాల్గొన్నారు. అయితే బ్రాహ్మణపల్లి సబ్ స్టేషన్ వద్ద పోలీసు అధికారులు పోలీసు వాహనాలను అడ్డంపెట్టి పాదయాత్రను అడ్డగించారు. దీంతో వైసిపి నాయకులు రోడ్డుపై బైఠాయించడంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆ తర్వాత పోలీసు అధికారులు అనుమతించడంతో పాదయాత్ర బ్రాహ్మణపల్లి మీదుగా నరసాపురం, కుర్లగుండ వరకూ దాదాపు 8 కిలోమీటర్లు సాగింది. పాదయాత్రలో పార్టీ మండల కన్వీనర్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తా'

మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

తనపై చేసిన ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా వైదొలుగుతానని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి తెలిపారు. నగరంలోని పివికెకె డిగ్రీ కళాశాలలో బుధవారం పల్లె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 30 ఏళ్లుగా రాజకీయాల్లో నీతి, నిజాయితీ, పారదర్శకంగా పనిచేస్తున్నానన్నారు. నియోజకవర్గంలో ఎవరు ఇబ్బందుల్లో ఆదుకుంటూ అండగా ఉన్నానన్నారు. అవినీతి, అక్రమాలు చేయాల్సిన అవసరం లేదన్నారు. అయితే ఇటీవల గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ అనే వ్యక్తి అనవసరంగా, ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మా గ్లోబల్ హార్టికల్చర్ కంపెనీలో ఏడుగురు డైరెక్టర్లలో ఆదినారాయణ ఒకరన్నారు. అతడు మిగతా డైరెక్టర్లకు తెలియకుండా కంపెనీకి చెందిన వంద ఎకరాల పైచిలుకు భూమిని అక్రమంగా కాజేయగా కంపెనీ తరఫున డైరెక్టర్లందరూ ఎన్‌సిఎల్‌టికి, న్యాయస్థానానికి వెళ్లి స్టే తీసుకొచ్చామన్నారు. అలాగే ముదిగుబ్బ మండలం అడవి బ్రాహ్మణపల్లిలో 170 ఎకరాలు, నగర శివారులోని అనంతలక్ష్మి కళాశాల ఎదురుగా రూ. 50 కోట్లకు పైగా విలువచేసే ప్రభుత్వ భూమి, చిలమత్తూరు మండలం సోమగుట్ట వద్ద 50 ఎకరాలు, కియా కార్ల ఫ్యాక్టరీ చుట్టూ పక్కల రైతులను బెదిరించి భూములు కబ్జా చేశాడ న్నారు. నాతో పాటు ఆదినారాయణ భూ అక్రమాలపై సిట్టింగ్ జడ్జి లేదా సిట్ ఏర్పాటుచేసి విచారణ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నేను ఒక సెంటు భూమి కాజేసినట్లు నిరూపించినా రాజకీ యాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటా.. నడిరోడ్డుపై ప్రజలకు క్షమాపణ చెబుతా అన్నారు. అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు వాస్తవాలు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

కూటమి ప్రభుత్వం మెడలు వంచుతాం

'వెన్నుపోటు దినం' నిరసన ర్యాలీల్లో కదంతొక్కిన వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి-అనంతపురం


రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనా వైఫల్యాలను ఎండగడుతూ వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నగరంలో చేపట్టిన 'వెన్నుపోటు దినం' నిరసన ర్యాలీతో ఆ పార్టీ శ్రేణులు కదం తొక్కారు. ముందుగా పాతూరులోని తాడిపత్రి బస్టాండ్‌లో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి అనంతతో పాటు పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌కుమార్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆ తర్వాత చెన్నకేశవస్వామి దేవాలయం నుంచి పవర్ ఆఫీస్ మీదుగా కలెక్టరేట్ వరకూ ర్యాలీ చేపట్టారు. బాబు ష్యూరిటీ ఇస్తే మోసం గ్యారంటీ అనే ప్లకార్డులు ప్రదర్శించారు. అనంత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా సూపర్‌సిక్స్ పథకాలు, ఎన్నికల హామీలు అమలు చేయకపోగా ప్రజల దృష్టి మరల్చడానికి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. వైసిపి శ్రేణులపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారన్నారు. వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకుని అరాచక పాలన చేస్తున్నారన్నారు. లా అండ్ ఆర్డర్‌ను సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. ఎన్నికల హామీలు అమలు జరిగేలా కూటమి ప్రభుత్వం మెడలు వంచుతాం అన్నారు. నరేష్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల పక్షాన వైసిపి పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలోకి వెళ్లి కలెక్టర్ వినోద్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

రాయదుర్గం : సూపర్‌సిక్స్ పథకాలు, ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలో వైసిపి ఆధ్వర్యంలో 'వెన్నుపోటు దినం'పై వినాయక కూడలి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి, తహశీల్దార్ నాగరాజుకు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబుకు వెన్నుపోటు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. అమరావతి అభివృద్ధి పేరిట వారి ఆస్తులు పెంచుకుంటున్నారన్నారు. మహిళలపై వేధింపులు పెరిగినా డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ స్పందించలేదన్నారు. లోకేష్ ఎన్ని కేసులు పెట్టించినా భయపడేది లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, నాయకులు గౌని ఉపేంద్రరెడ్డి, మెట్టు విశ్వనాథరెడ్డి, బిటిపి గోవిందు, ఉషారాణి, భోజరాజునాయక్, మేకల శ్రీనివాసులు, గౌని లక్ష్మీకాంతరెడ్డి, ఆలేరు రాజగోపాల్‌రెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఏడాదిలోనే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత

నార్పల : కూటమి ప్రభుత్వంపై ఏడాదిలోపే రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని శింగనమల నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త శైలజనాథ్ పేర్కొన్నారు. వైసిపి ఆధ్వర్యంలో బుధవా రం స్థానిక వాల్మీకి దేవాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ వెన్నుపోటు దినం ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ కూడలిలో శైలజనాథ్, ఆ పార్టీ సీనియర్ నాయకులు సత్యనారాయణ రెడ్డి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అధికారం చేపట్టి ఏడాదైనా ఎన్నికల హామీలు అమలు చేయలేని అసమర్థ ప్రభుత్వమన్నారు. ప్రచార ఆర్భాటం తప్పితే సంక్షేమం, అభివృద్ధి ఎక్కడా కానరావడం లేదన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరరావు, నారాయణరెడ్డి, గోకుల్‌రెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, జడ్పిటిసి నీలం భాస్కర్, ఎంపీటీసీలు శంకర్, రాజారెడ్డి, పద్మాకర్‌రెడ్డి, సర్పంచులు రాంభూపాల్‌రెడ్డి, రామాంజనేయులు, కుళ్లాయిరెడ్డి, ఉప సర్పంచి శ్రీరాములు, ప్రతాపరెడ్డి, రంగయ్య, నాగలింగరెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.



నార్పలలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సత్యనారాయణరెడ్డి, చిత్రంలో శైలజనాథ్



రాయదుర్గంలో తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వైసిపి నాయకులు

అభివృద్ధి, సంక్షేమం పట్టని ప్రభుత్వం

రాప్తాడు : కూటమి ప్రభుత్వం వైసిపి శ్రేణులను అరెస్టులు చేయడం, వేధించడం, హత్యలను ప్రోత్సహించడం పెట్టిన దష్టి రాష్ట్రం అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై పెట్టలేదని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. రాప్తాడులో బుధవారం ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం ర్యాలీ నిర్వహిం చారు. ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా సూపర్ సిక్స్ పథకాలు, ఎన్నికల హామీలు అమలు చేయడం విఫలమైం దన్నారు. వైసిపి పాలనలో జగన్ ప్రజల శ్రేయస్సు కోసం చిత్తశుద్ధితో పని చేశారన్నారు. ప్రస్తుతం చంద్రబాబు అబద్ధాల పాలన చేస్తున్నార న్నారు.

వెన్నుపోటు బాబుకు బుద్ధి చెబుదాం

ఉరవకొండ : అబద్ధపు హామీలతో అధికారం చేపట్టి రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచిన సిఎం చంద్రబాబుకు బుద్ధి చెబుదామని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. విశ్వ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో వెన్నుపోటు దినం నిర్వహించారు. ముందుగా స్థానిక ఉరగాద్రి కళ్యాణ మండపం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ప్రధాన రహదారి గుండా పార్టీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీ చేపట్టారు. విశ్వ మాట్లాడుతూ సూపర్ సిక్స్ సహా 143 హామీలతో ప్రజలను నమ్మించి ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి ప్రభుత్వం ఏడాదైనా వాటిని అమలు చేయకపోగా పాలనలో విఫలమైందన్నారు. దీంతో ప్రజల తరపున వైసిపి ఉద్యమబాట పట్టింద న్నారు. మంత్రి పయ్యావుల సోదరులు వైసిపి శ్రేణులపై అక్రమంగా కేసులు బనాయించి బలవంతంగా పార్టీ మారాలని ఒత్తిడి చేస్తున్నారని మండిపడ్డారు. హంద్రీనీవా కాలువ అభివృద్ధి పేరుతో కమీషన్ల కోసం కక్కుర్తి పడుతున్నారని ఆరోపించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో విడపనకల్లు ఎంపీపీ కరణం పుష్పవతి భీమిరెడ్డి, మండల కన్వీనర్ కురుబ రమేష్, నాయకులు కరణం భీమిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు బోయ నాగేంద్ర, సుంకన్న, ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




కళ్యాణదుర్గంలో ర్యాలీ చేపట్టిన వైసిపి నాయకులు

వెన్నుపోటు బాబుకు ప్రజలే బుద్ధి చెప్పాలి

కళ్యాణదుర్గం రూరల్ : ఎన్నికల హామీలను విస్మరించిన సిఎం చంద్రబాబుకు ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య సూచించారు. వైసిపి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ఆర్‌డిటి హాస్పిటల్ నుంచి ఆర్‌డిఒ ఆఫీస్ వరకూ రంగయ్య ఆ పార్టీ ముఖ్య నాయకులు మాదినేని ఉమామహేశ్వర నాయుడు, రాష్ట్ర కార్యదర్శి బి.తిప్పేస్వామి, నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. రంగయ్య మాట్లాడుతూ తల్లికి వందనం పేరుతో పిల్లలకు, అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు, నిరుద్యోగ భృతి పేరుతో నిరుద్యోగులకు, ఉచిత బస్సు ప్రయాణం పేరుతో మహిళలకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని మండ పడ్డారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యాడికి : వైసిపి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ వెన్నుపోటు దినంపై ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ సుధాకర్‌బాబు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకుల ఫయాజ్‌బాషా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ ప్రతాపరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు పోలీసులు వైసిపి నాయకులను ఎక్కడికక్కడ కట్టడి చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరామిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, నాగేష్, మండల కన్వీనర్ సంజీవరాయుడు, పేరం వెంకట్రామిరెడ్డి, పటాన్ ఫారుక్ పాల్గొన్నారు.



రాప్తాడులో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వైసిపి నాయకులు

విద్యకు అధిక ప్రాధాన్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం ఎమ్మెల్యే కుందుర్పి, కంబదూరు, శెట్టూరు, కళ్యాణదుర్గంలో కెజిబివి జూనియర్ కళాశాలల భవణ నిర్మాణాలకు భూమిపూజ చేశా రు. అలాగే శిలా ఫలకాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు కల్పించి, ఉన్నత చదువులు చదువుకునేలా ప్రోత్సహిస్తున్నార న్నారు. విద్యార్థులు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండేందుకు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఒక్కో భవనం నిర్మాణానికి రూ. 1.60 కోట్ల చొప్పున, నియోజక వర్గంలోని 4 భవనాలకు రూ. 6.40 కోట్లు మంజూరయ్యాయ న్నారు. భవనాల నిర్మాణంలో నాణ్యతలో ఏ మాత్రం రాజీ పడకుండా చూడాలని ఆదేశించారు.

ఎమ్మెల్యే సొంత నిధులతో హైస్కూల్ అభివృద్ధి

పట్టణంలోని కోటవీధిలో ఉన్న ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సొంత నిధులు రూ. 25 లక్షలతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు కోట వీధి కౌన్సిలర్ వెంకటేష్ మహాలక్ష్మి తెలిపారు. ఆమె మాట్లాడుతూ వైసిపి పాలనలో నియోజకవర్గంలో అప్పటి మంత్రి ఉషశ్రీచరణ్ చేసిందేమీ లేదన్నారు. వర్షం కురిస్తే బాలికల హైస్కూల్ మైదానంలో మోకాలి లోతు నీరు నిలిచి బాలికలు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే స్థానిక టిడిపి నాయకులు, విద్యార్థినుల తల్లితండ్రులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే వారి సిబ్బందితో అంచనా వేయించి 4 రోజుల్లోనే సొంత నిధులు రూ. 25 లక్షలతో పనులు ప్రారంభించారన్నారు. నెల రోజుల్లో బాలికల పాఠశాల మైదానం పూర్తిగా మారనుందని విద్యార్థినుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



కదిరిదేవరపల్లి-తిరుపతి రైలు పున:ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కదిరిదేవరపల్లి-తిరుపతి రైలు పున:ప్రారంభం

రెండేళ్లుగా ఆగిపోయిన కదిరిదేవరపల్లి - తిరుపతి రైలును బుధవారం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పచ్చ జెండా ఊపి పున:ప్రారంభిం చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మండల సమావేశంలో సమస్యలు ఏకరువు

ప్రజాశక్తి-శింగనమల

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు సమస్యలు ఏకరువు పెట్టా రు. ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపి డిఒ భాస్కర్, వైస్ ఎంపీపీ నరసింహులు పాల్గొనగా ప్రజాప్రతినిధులు ఎంపీటీసీలు, సర్పంచు లు, పలు సమస్యలను లేవనెత్తారు. గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, డ్రెయినేజీ, సీసీ రోడ్లు వేయాలన్నారు. విద్యుత్ ఏఈ, ఏపీవోలు లేక రైతులు, కూలీలు నానా అవస్థలు పడుతున్నార న్నారు. శింగనమలలో విద్యుత్ లైన్‌మెన్ లేక విద్యుత్ సమస్య వస్తే ఎవరితో చెప్పుకోవాలో ప్రజలకు తెలియడం లేదన్నారు. ప్రయివేటు స్కూల్స్ యజ మానులు అధిక ఫీజులు వసూలు చేస్తున్నా ఆ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఉపాధి హామీ కూలీలకు 6 వారాలుగా బిల్లులు అందలేద న్నారు. రీ సర్వే పేరుతో 5, 10 సెంట్లు కుదించి సర్వే చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో పంచాయతీ రాజ్ అధికారిణి కృష్ణజ్యోతి, ఐసిడిఎస్ సిడిపిఒ ఉమా శంకరమ్మ, డిప్యూటీ తహశీల్దార్ ప్రకాష్‌రావు, అగ్రికల్చర్ ఏవో అన్వేష్ కుమార్, వెటర్నరీ డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంఈఓ నరసింహరాజు, పిహెచ్‌సి డాక్టర్ శంకర్ నాయక్, ఎంపిటిసిలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

గుమ్మేపల్లిలో సమస్యలు పరిష్కరించాలని వినతి

మండలంలోని గుమ్మేపల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సర్పంచి దేగల లలితమ్మ ఎంపీడీవో భాస్కర్, ఎంపీపీ యోగేశ్వరిలకు విన్నవించారు. ఆమె మాట్లాడుతూ గుమ్మేపల్లిలో పైప్‌లైన్ మరమ్మతలు చేపట్టాలని, ఫ్లోరైడ్ సమస్య పరిష్కరించాలని కోరారు. గుమ్మేపల్లి, ఏకులనాగుపల్లి గ్రామాల్లో అర్ధాంతరంగా ఆగిన 3 అంగన్వాడీ కేంద్రాల భవణ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు.

యోగాతో మానసిక ఆరోగ్యం : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-అనంతపురం

యోగాసనాలు వేయడం ద్వారా ఒత్తిడిని దూరం చేసుకోవచ్చని, తద్వారా మానసిక ఆరోగ్యం చేకూరుతుందని డిఎంహెచ్ఒ డాక్టర్ ఈబి.దేవి తెలిపారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా బుధవారం విద్యా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని పిటిసి ప్రాంగణంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిఎంహెచ్ఒ మాట్లాడుతూ ఆరోగ్య, ఆనంద ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకుని జూన్ 21వ తేదీ నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనాల న్నారు. యోగాసనాలు వేయడం ద్వారా శారీరక రుగ్మతల నుంచి బయటపడవచ్చన్నారు. డిఇఒ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో దాదాపు 750 మంది యోగ అభ్యాసకులు పాల్గొని యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి శైలజ, డివిఒ రమణ, పిటిసి ప్రిన్సిపల్ వాసుదేవన్, ఎఆర్ డీఎస్పీ నీలకంఠ, డిటిడబ్ల్యుఒ రామాంజనేయులు, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ డిడి కుష్బు, డిపిఆర్ఒ పి.గురుస్వామిశెట్టి, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ పద్మశ్రీ, ఆయుష్ డిపార్ట్మెంట్ అధికారులు డా. లాల్యానాయక్, డా. భాస్కర్, యోగా గురువులు కృష్ణవేణి, గురురాజారావు, డెమో త్యాగరాజు, డిప్యూటీ హెచ్ఈఓ గంగాధర్, విద్యా శాఖ అనుబంధ శాఖల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



యోగాంధ్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

బ్రహ్మసముద్రం : యోగాంధ్రను విజయవంతం చేయాలని ఉపాధ్యాయుడు, జెవివి సభ్యులు రాజన్న సూచించారు. ఆయన విద్యార్థుల చేత యోగాసనాలు వేయించారు. ప్రతిరోజు యోగా చేస్తే మానసిక ఒత్తిడి తగ్గి సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చు అన్నారు. వజ్రాసనం మానసిక ఒత్తిడిని, వెన్ను నొప్పిని తగ్గిస్తుందని, జీర్ణ క్రియకు దోహదపడుతుందన్నారు.

ఇళ్ల స్థలాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణ పరిధిలో సొంతిల్లు లేని పేదలు ఇళ్ల స్థలం కోసం సంబంధిత వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ నాగరాజు సూచించారు. అర్హులందరికీ ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇస్తామన్నారు. గతంలో ఇళ్ల పట్టా తీసుకుని మూడేళ్ల గడిచినా ఇల్లు నిర్మించుకోని వారి ఇళ్ల పట్టాలు రద్దు చేసేందుకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. అలాంటి వారి పట్టాలు, స్థలాలు రద్దుచేసి అర్హులకు కొత్తగా ఇళ్ల పట్టాలు ఇస్తామన్నారు. అలాగే సొంతంగా స్థలం ఉండి ఇంటి నిర్మాణం కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వారి అర్హతను బట్టి రాష్ట్ర ప్రభుత్వం పక్కా ఇల్లు నిర్మాణానికి ఆర్థిక సాయం మంజూరు చేస్తుందన్నారు. ప్రభుత్వ, కొండ, వంక పోరంబోకు స్థలాల్లో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు చేపడితే తొలగిస్తామన్నారు. దళారులను నమ్మి రికార్డులు లేని ఖాళీ స్థలాలను ఎవరూ కొనవద్దని సూచించారు.

లో వోల్టేజీ సమస్యకు పరిష్కారం


ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలోని 1వ వార్డు కొలిమి ప్రాంతంలో దీర్ఘకాలంగా విద్యుత్ లో వోల్టేజీ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. ఈ విషయాన్ని స్థానిక టిడిపి నాయకులు మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి ఆదేశాలతో ఏఈ గురుమూర్తి యుద్ధ ప్రాతిపదికన నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ లైన్‌మెన్ శర్మాస్, నాయకులు ఖలందర్, ం కేశవ, ఖాజా, నిరంజన్‌గౌడ్, మీనుగ పెద్దన్న, అనిల్, జమీల్, తదితరులు పాల్గొన్నారు.

దాసరి వెంకటరమణ ఆర్థికసాయం

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని గురుగుంట్ల గ్రామంలో బుధవారం మూడు కుటుంబాలకు నాగులగుడ్డంకు చెందిన దాసరి వెంకటరమణ రూ. 30 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన నాగభూషణం కొడుకు మురళి 15 రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకున్న దాసరి వెంకటరమణ వారి ఇంటికి వెళ్లి పరామర్శించి వైద్య ఖర్చులకు రూ. 10వేలు అందజేశారు. భవిష్యత్తులో కూడా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం మాచర్లప్ప కుమారుడు వెంకటరమణ వివాహ ఖర్చులకు రూ. 10వేలు అందజేశారు. ఎర్రిస్వామి కుమార్తె అంజలి వివాహానికి రూ. 10వేలు అందజేశారు. ఆయన వెంట లక్ష్మణ్, ఆది, హరి, రమేష్, మల్లి, కళ్యాణ్, డ్రైవర్ మల్లి, ఓబులేష్, పవన్‌కుమార్, పెన్నా, నాగరాజు ఉన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న దాసరి వెంకటరమణ



'సుపరిపాలన మొదలై ఏడాది' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

జనసేన ఆధ్వర్యంలో 'సుపరిపాలన మొదలై ఏడాది'

ప్రజాశక్తి-ఉరవకొండ

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా పట్టణంలోని జనసేనపార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌతం కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం 'సుపరిపాలన మొదలై ఏడాది-పీడ విరగడై నేటికీ ఏడాది' పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ అరాచక, నిరంకుశ పాలనకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పి ప్రజాస్వామ్య పరిరక్షణకు నాంది పలికిన రోజు జూన్ 4 అని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉరవకొండ, వజ్రకరూరు, కూడేరు మండలాల కన్వీనర్లు చంద్రశేఖర్, కేశవ్, నాగేష్, నాయకులు దేవేంద్ర, రమేష్, మణి కుమార్, వంశీ, అనిల్, భోగేష్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించిన విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు, ఎన్ఎస్‌యుఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల ప్రసాద్, నాని, శ్రీకాంత్, ఎన్ఎస్‌యుఐ నాయకులు అనిల్, లోకేష్, గణేష్ ఎంఇఒ-2 వెంకట రమేష్‌కు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ పట్టణంలో పలు ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేసుకోవడంతో పాటు పాఠ్య, నోట్ పుస్తకాలు, విద్యా సామగ్రి పాఠశాల లోనే కొనుగోలు చేయాలని నిబంధన పెట్టారని, అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఫిర్యాదు చేశారు. ఫీజు వివరాలు నోటీసు బోర్డులో ప్రదర్శించడం లేదని, మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని ఆరోపించారు. తక్షణమే ఆయా పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని, లేనిచో పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఎదుట పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని తెలిపారు.

విత్తన వేరుశనగ నాణ్యత పరిశీలన

ప్రజాశక్తి-శింగనమల

ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో విత్తన వేరుశనగ నాణ్యతను పరిశీలిం చారు. వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ప్రతి రైతు సేవా కేంద్రంలో నాణ్యమైన విత్తన వేరుశనగ అందు బాటులో ఉంచాలన్నారు. విత్తన వేరుశనగ, వరి, కంది, జొన్న, అలసంద, ఉలవలను 90శాతం సబ్సిడీతో అందించాలన్నారు. సబ్సిడీపై జిప్సం, జింకు అందించాలన్నారు. ఒక్కో రైతుకు 5 బ్యాగుల విత్తన వేరుశనగ ఇవ్వాలన్నారు. ప్రస్తుతం వచ్చిన విత్తన వేరుశనగలో కల్తీ రకాలు ఉన్నాయ న్నారు. వారి వెంట ఎర్రిస్వామి, కొండారెడ్డి, సుంకన్న, శ్రీనివాసులు, నాగేంద్ర, కుళ్లాయప్ప, ఓబిరెడ్డి, శ్రీనివాసులు, ఆంజనేయులు, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులు తగ్గించాలి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

పంటల సాగులో రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని కళ్యాణదుర్గం వ్యవసాయ క్షేత్రం శాస్త్రవేత్త చంద్రాయుడు సూచించారు. 'వికసిత భారత్ సంకల్పయాత్ర'లో భాగంగా బుధవారం శాస్త్రవేత్త చంద్రాయుడు, వారి బృందం మండలంలోని దేవగిరి, గోవిందవాడ, హొన్నూరు గ్రామాల్లో పర్యటించారు. వారు ముందుగా రైతులతో సమావేశమై వారి సమస్యలు తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ రైతులు విత్తన శుద్ధి చేయాలని, నూతన వంగడాలను వినియోగించి దిగుబడి పెంచుకో వాలని సూచించారు. పేడ ఎరువు వినియోగిస్తే భూమి సారవంతమై దిగుబడి పెరగుతుందన్నారు. అలాగే దుక్కిలో పిల్ల మినుములు, సద్దలు, మెంతులు, విత్తనాలు చల్లి అవి మొలకెత్తిన తర్వాత దుక్కి చేస్తే దిగుబడి పెరుగుతుంద న్నారు. ముఖ్యంగా రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు తగ్గించాలన్నారు. కొత్తగా మైక్రో విత్తనాలు మనుగడలోకి వచ్చాయని, వాటిని వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో రాయదుర్గం ఎడి నాయక్, బొమ్మనహాల్ ఏవో సాయికుమార్, ఆర్‌ఎస్‌కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

యాడికి : విషజ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. మలేరియా నివారణ మాసోత్సవం సందర్భంగా బుధవారం రాయలచెరువు పిహెచ్‌సి పరిధిలోని కేశవరాయనిపేట గ్రామ అంగన్వాడీ కేంద్రంలో వైద్యులు అప్పయ్య ఆధ్వర్యంలో ప్రజలకు విష జ్వరాలపై అవగాహన కల్పించారు. అప్పయ్య, శ్రీనివాసులు మాట్లాడుతూ కీటక జనిత వ్యాధులైన డెంగీ, మలేరియా, చికెన్‌గునియా, బోధకాలు, టైఫాయిడ్, విషజ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, ఫ్రైడే డ్రైడే పాటించాల న్నారు. మురికి కాలువలు శుభ్రంగా ఉంచాలని, రాత్రిపూట ఇంట్లో దోమతెరలు వాడాలని సూచిం చారు. కార్యక్రమంలో సూపర్వైజర్ షబ్బీర్ అహ్మద్, హెల్త్ అసిస్టెంట్ మైనుద్దీన్, ల్యాబ్ టెక్నీషియన్ సాయిలత, ఎఎన్ఎం రంగమ్మ, ఆశా కార్యకర్త శివలక్ష్మి పాల్గొన్నారు.

వైసిపి బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాగేష్

ప్రజాశక్తి-యాడికి

వైసిపి బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాయలచెరువుకు చెందిన తలారి నాగేష్‌ను నియమించారు. దీంతో నాగేష్ ఆ పార్టీ అధినేత జగన్, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామనని తెలిపారు. నాగేష్‌కు ఆ పార్టీ జిల్లా వికలాంగుల విభాగం అధ్యక్షుడు ఉపేంద్రగౌడ్ శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా ప్రచార విభాగం కార్యదర్శిగా పేరం వెంకటరామిరెడ్డి

మండలంలోని గుడిపాడు గ్రామానికి చెందిన వైసిపి యువ నేత పేరం వెంకట్రామిరెడ్డిని ఆ పార్టీ జిల్లా ప్రచార విభాగం కార్యదర్శిగా నియమించారు. ఇప్పటి వరకూ ఆయన మండల యూత్ ప్రెసిడెంట్, సోషల్ మీడియా కన్వీనర్‌గా పని చేశారు. వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ తనను నియమించిన పార్టీ అధినేత జగన్, జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

విద్యుత్ వైర్ల సమస్యకు పరిష్కారం

పుట్లూరు : మండలంలోని నారాయణరెడ్డిపల్లి దళితవాడలో నెలకొన్న విద్యుత్ వైర్ల సమస్యను ఆ శాఖ అధికారులు పరిష్కరించారు. సమస్యను తెలిపిన నాలుగు రోజుల్లోనే మరమ్మతులు చేపట్టిన ట్రాన్స్‌కో ఏఈకి ఎపి కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీటి రామాంజనేయులు, గ్రామప్రజలు కృతజ్ఞతలు తెలిపడంతో పాటు హర్షం వ్యక్తం చేశారు. కాలనీలో బుధవారం జరుగుతున్న పనులను రామాంజనే యులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట ఎపి రైతు సంఘం మండల ఉపాధ్యక్షుడు బి.చిన్నికృష్ణుడు యాదవ్, నాయకులు కె.నాగపుల్లయ్య, కె.ఓబులేసు పాల్గొన్నారు.

ఏడాది పాలనపై 'కూటమి' సంబరాలు

ఆత్మకూరు : కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ముందుగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ ఏడాదిలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి శశాంక్ చౌదరి, నాయకులు హనుమప్పచౌదరి, సూర్యనారాయణ, ఓబుళపతి, రాజారమేష్, కేశవ, సుధాకర్‌రెడ్డి, మల్లన్న, ఆనంద్, అంజప్ప పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దగ్గుపాటి సాయం మరువలేను

ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు సాకే వెంకటేశులు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రాణాపాయస్థితిలో ఉన్న సమయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అందించిన సాయం మరువలేనిదని టిడిపి ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు సాకే వెంకటేశులు తెలిపారు. ఇటీవల నగరంలో నిర్వహించిన అనంతపురం అర్బన్ నియోజకవర్గ మినీ మహానాడులో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సాకే వెంకటేశులు బెంగళూరులో ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొంది పూర్తిగా కోలుకున్నాక అనంతపురం వచ్చారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతో క్షణికావేశంలో పురుగుల మందు తాగానన్నారు. ఆసుపత్రి పాలైన తనకు ఎమ్మెల్యే రూ. 5లక్షలు ఖర్చు చేసి మెరుగైన వైద్యం అందించి సోదరుడిలా కాపాడారన్నారు. ఇకపై కూడా ఎమ్మెల్యే దగ్గుపాటితోనే నా ప్రయణం అని స్పష్టం చేశారు. తాను ఆత్మహత్యాయత్నం చేసుకున్న విషయాన్ని, వైద్య చికిత్సల అంశాన్ని కూడా కొందరు రాజకీయం చేశారని.. ఇది మంచిది కాదన్నారు.

వాహనాల తనిఖీ

పుట్లూరు : పుట్లూరు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద బుధవారం సిఐ సత్యబాబు ఆధ్వర్యంలో పోలీ సులు వాహనాల తనిఖీలు చేపట్టారు. అధిక లోడుతో వెళ్తున్న వాహనాలను ఆపి డ్రైవర్లు, ప్రయాణి స్తున్న కూలీలకు అవగాహన కల్పించారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్, రికార్డులు పరిశీలించి లేని వాహ నాలకు జరిమానా విధించారు. సిఐ మాట్లాడుతూ రోడ్డు మీద ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలని, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదన్నారు. ఎప్పుడూ డ్రైవింగ్ లైసెన్స్, రికార్డులు వెంట ఉంచుకోవాలని సూచించారు. తనిఖీల్లో ఎస్ఐ వెంకట నరసింహ, పోలీసులు పాల్గొన్నారు.

ఎరువుల వాడకంపై అవగాహన

పెద్దపప్పూరు : వ్యవసాయ రంగంలో అధిక మోతాదులో ఉపయోగించే ఎరువులు, పురుగు మందులకు స్వస్తి చెప్పి, పంటల సాగులో వైవిధ్యాన్ని ప్రోత్సహించాలని కృషి విజ్ఞాన కేంద్రం రెడ్డిపల్లి, రేకులకుంట శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. 'వ్యవసాయంలో అత్యాధునిక పద్ధతులు-సేంద్రియ ఎరువుల వాడకం-కాంప్లెక్స్ ఎరువుల వల్ల భూములు ఎలా మొద్దు బారిపోతాయి' తదితర అంశాలపై బుధవా రం మండలంలోని చిక్కేపల్లి, నరసాపురం గ్రామాల్లో సభలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ నూతన సాంకేతికత, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, నూతన పద్ధతులు, వంగడాలు, డ్రోన్ స్ప్రేయింగ్, తదితర అంశాలపై వివరించారు. సమావేశంలో ఏవో ఆంజనేయులు, శాస్త్ర వేత్తలు డాక్టర్ కిషోర్‌రెడ్డి, డాక్టర్ సుధీర్, ఆత్మ, ఆర్‌ఎస్‌కె సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

ఉరవకొండ : సబ్సిడీ విత్తన వేరుశనగ కోసం సంబంధిత రైతు సేవా కేంద్రంలో రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని విడపనకల్లు ఏవో పెన్నయ్య సూచించారు. ఆయన బుధవారం మండలంలోని రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి విత్తన రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన వెంట ఏఈఓ రాఘవేంద్ర, ఆర్‌ఎస్‌కె సిబ్బంది కుళ్లాయినాయక్, రైతులు ఉన్నారు.

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

ఆత్మకూరు : మండలంలోని పంపనూరు గ్రామంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా పంపనూరులోని పార్క్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే విత్తన వేరుశెనగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు.

కిశోరి వికాసంతో మానసిక ఉల్లాసం

బ్రహ్మసముద్రం : కిశోరి వికాసంతో మానసిక ఉల్లాసం పెరుగుతుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ కాశింబి తెలిపారు. స్థానిక అంగన్వాడీ కేంద్రంలో బుధవారం ఆమె కిశోర్ బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. బాలల హక్కులు, చట్టాలు, హెల్ప్ లైన్ నంబర్స్ గురించి తెలిపారు. ఎఎన్ఎం నాగమణి మాట్లాడుతూ 11-18 ఏళ్ల లోపు పిల్లలు తీసుకోవాల్సిన ఆహారం, ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు, రక్త హీనత రాకుండా ఆకుకూరలు, కూరగాయలు వాడాల న్నారు. రక్తహీనత ఉన్న పిల్లలు ఐరన్ టాబ్లెట్ వాడాలన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు సత్యవతి, శాంతి, ఆశా వర్కర్లు, కిశోర్ బాలికలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ అధికారిణులు